క్లుప్తంగా

హార్సిలీహిల్స్ మేనేజర్‌గా శ్రీధర్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ టూరిజం మేనేజర్‌గా కే.శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి ఉత్తర్వు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి నెల్లూరుకు బదిలీ కావడంతో విజయవాడ డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడ నియమించారు.

పీ-4 సర్వేపై సమీక్ష

నిమ్మనపల్లె : స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పీ-4 సర్వేపై సోమవారం ఎంపీడీఓ రమేష్‌బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీ-4 సర్వేలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను ఆగస్టు 15లోపు ఎంపిక చేయాలన్నారు. పెన్షన్ పంపిణీ 1వ తారీఖు ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించి లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అందజేయాలన్నారు. పెన్షన్‌దారులకు సంబంధించిన డేటాలో కరెక్ట్ ఫోన్ నెంబర్లు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తసేకరణ, పారిశుధ్య పనులు, నిర్లక్ష్యం లేకుండా పూర్తిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

45 వృక్షాల నరికివేత

బి.కొత్తకోట: మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీలో 45 వృక్షాలను నరికివేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. న్యాయస్థానం పరిధిలో వాజ్యాలు నడుస్తున్న భూములకు సంబంధించిన వాటిలోని వృక్షాలను నరికివేయించడంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు మీడియా దృష్టికి తెచ్చారు. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పది మంది వీఆర్‌ఓల బదిలీ

మదనపల్లె: మదనపల్లె పట్టణం, రూరల్ మండలంలో పనిచేస్తున్న పది మంది వీఆర్‌ఓలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వు జారీ చేశారు. ఇందులో సీటీఎం-1 వీఆర్‌ఓ జాన్సన్ ప్రదీప్‌కుమార్‌ను కోటకొండకు, కొత్తవారిపల్లె వీఆర్‌ఓ మాధవరెడ్డిని జర్రావారిపల్లెకు, బీకే పల్లె వీఆర్‌ఓ టి.మస్తాన్‌ను ముష్టూరుకు, వలసపల్లె వీఆర్‌ఓ ఎం.శ్రీనివాసులు మునెల్లపల్లికి, కోళ్లబైలు-2 వీఆర్‌ఓ కె.నారాయణ పోతబోలుకు, కోళ్లబైలు-1 వీఆర్‌ఓ జి.శివశంకర్‌ను మర్రిమాకులపల్లెకు బదిలీ చేశారు అలాగే అంకిశెట్టిపల్లె వీఆర్‌ఓ సంధ్యను పొన్నుటిపాళెంకు, పొన్నుటిపాళెం వీఆర్‌ఓ కే.శేఖర్ పట్టెంవాండ్లపల్లెకు, బసినికొండ వీఆర్‌ఓ వి.విజ్ఞాన్ తెట్టు-2కు, పోతబోలు వీఆర్‌ఓ జే.శ్రీనివాసులును మల్లెలకు బదిలీ చేశారు.

డంపింగ్ యార్డుకు నిప్పు

బి.కొత్తకోట: స్థానిక పీటీఎంరోడ్డులోని దేవదాయ భూముల్లో వేసిన చెత్త, వ్యర్థాలకు సోమవారం నిప్పు పెట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. బి.కొత్తకోట-పెద్దతిప్పసముద్రం మార్గం సమీపంలో ఈ మంటలు వ్యాపించగా వాటినుంచి దట్టమైన పొగ చుట్టూ కమ్మేసింది. దీనితో తీవ్రమైన దుర్వాసన, శ్వాస తీసుకోవడానికి రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులు పడ్డారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

బి.కొత్తకోట: కేంద్రప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషా, కార్య నిర్వహక అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లోని 46వేల క్లయిమ్‌లను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలన్నారు. 12 రకాల సౌకర్యాలను అందించాలని, లేబర్ కార్యాలయాల్లో ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త గుర్తింపు కార్డులు జారీచేసి పాతకార్డులను రెన్యూవల్ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ బావాజాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, బాలకృష్ణ, గఫూర్, చౌడప్ప, బాబు, షౌకత్, షేక్‌షావలీ, ప్రసాద్ పాల్గొన్నారు.

నిషేధిత భూమిపై విచారణ

బి.కొత్తకోట: స్థానిక బీరంగిరోడ్డులో ప్రభుత్వ భూమిగా బోర్డు పెట్టిన భూమిలో దున్నిన ఘటనపై తహసీల్దార్ బావాజాన్ సోమవారం విచారణ జరిపారు. కొన్నేళ్ల క్రితం ఈ భూమిలో ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిక బోర్డును పెట్టారు. అయినా ఆ భూమిలోకి ప్రవేశించి దుక్కులు దున్నడంతో వీఆర్‌ఓ శ్రీరాములు స్పందించి పోలంలోకి ప్రవేశించరాదని సంబంధిత వ్యక్తులకు ఆదేశించారు. దీనిపై తహసీల్దార్ కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేటి నుంచి పట్టాభిషేక మహోత్సవాలు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన శ్రీపట్టాభిరామస్వామివారి పట్టాభిషేక మహోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో ప్రారంభమై, బుధవారం ఉదయం యగశాల పూజ, 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, 6.30 గంటలకు శ్రీసీతారాముల కళ్యాణోత్సవం, 31న గురువారం ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి 8 గంటలకు గరుడవాహనంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

జగన్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

- కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటా ప్రచారం
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీకి విశేష స్పందన





కురబలకోట: తెట్టులో బాబూ షూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో నాయకులు, ములకలచెరువు: కూటమి ప్రభుత్వం మోసాలపై ప్రచారం

కురబలకోట: వైఎస్.జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిందని ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చూద్దామన్నా ఎక్కడా అభివృద్ధి జాడ కన్పించడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎంజి భూదేవి, తెట్టు సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి, డీఆర్. ఉమాపతిరెడ్డి, నార్లపల్లె వాసుదేవరెడ్డి,ఆర్కే కృష్ణారెడ్డి, రెడ్డికుమారి, మధుసూదన్ రెడ్డి, నక్కా రమాదేవి, ఎర్రబల్లె ఈశ్వర్ విమర్శించారు. బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం మండలంలోని తెట్టు, సింగన్న గారిపల్లెలో సోమవారం ఇంటింటా పెద్ద ఎత్తున నిర్వహించారు. బాబు మోసాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. వారు మాట్లాడుతూ జగన్ పాలనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఊరికి రోడ్లు, పల్లెలకు సిమెంటు రోడ్లు వేశారన్నారు. సచివాలయ భవనాల సముదాయాలు అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించారన్నారు. మారుమూల గ్రామాలైన తెట్టు, ఎర్రబల్లె పంచాయతీలో రూ. 1.60 కోట్లతో సచివాలయ భవన సముదాయాలు ఏర్పాటయ్యాయన్నారు. ఈ గ్రామాల్లో అన్ని ప్రభుత్వ స్కూళ్లు నాడు నేడు కింద అభివృద్ధి చెందాయన్నారు. లింక్ రోడ్లు వేశారన్నారు. జగన్ పాలనలో నీటి సమస్య అనేది ఎక్కడా లేదన్నారు. ముఖ్యంగా తెట్టు గట్లమీద ప్రాంతాలకు ఆపై పులుసుగుంతలకు తారు రోడ్డు సౌకర్యం రికార్డే కాకుండా ఎప్పటికీ మరుపురానిదన్నారు. ఆరోగ్యపురం, జల్లావారిపల్లె. అప్పలనాయునిపల్లె, విశ్వం కళాశాల మార్గం, దిగువపాలెంకు లింకు రోడ్లు కలలో కూడా ఆ ప్రాంత వాసులు ఊహించలేదన్నారు. అలాగే తెట్టు శ్రీవేణుగోపాల స్వామి గుడికి రూ.90 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు. గుడి ముందు ద్వారక బృందావన గార్డెన్ రూ. 15 లక్షలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుడి చుట్టూ కూడా సీసీ రోడ్లు వేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, సోమిరెడ్డి, సర్పంచ్ నాగరత్న,అంజాద్‌ఖాన్,గోపి, చక్రపాణి, మోహన్, నారాయణ, ఎం. ప్రభాకర్ రెడ్డి,శ్రీనివాసులు, శంకర, రాజశేఖర్, బాబు, సుబ్బారెడ్డి, వేణు, చలపతి, సదాశివ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు

బి.కొత్తకోట: అమలు చేయలేని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం పాలించే అర్హత కోల్పోయిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగన్నగారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని బడికాయలపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఇంటిఇంటికి వెళ్లి నిర్వహించారు. ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీల వివరాలను, మేనిఫెస్టోను తీసుకెళ్లి ప్రజలకు ఇచ్చారు. ఏడాదిగా హామీలు అమలు చేయకపోవడంతో ఆర్థికంగా ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, కరోనా కష్టాలు ఉన్నా వాటిని అధిగమించి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేసిన మోసంపై ప్రతిగడపకు వెళ్లి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసినంత అభివృద్ధి పనులు 75 ఏళ్ళ చరిత్రలో జరగలేదన్నారు. కాలిబాటలుగా ఉన్న జింకదాటినపల్లె, వలసగుట్టపల్లె, యాలగిరిపల్లె, గురికానిపల్లె, ఓగుశెట్టిపల్లెకు తారురోడ్లు నిర్మించడం చరిత్రని అన్నారు. బడికాయలపల్లె జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి రూ.కోటి మంజూరు, పేదలకు 150 పక్కా గృహాల మంజూరు, సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.11 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. టీడీపీ ఎన్నికల హామీ మోసాలపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు సాంబశివ, రవికుమార్ రెడ్డి, వెంకటరమణ, ఆదెప్ప, చంద్ర, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి, రెడ్డిశ్వర్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చిన్నికృష్ణ, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బయ్యారెడ్డి, శ్రీనివాసులు, మురళీ, శీను, రాజా, మహేష్, హరికృష్ణ సబ్జి పాల్గొన్నారు.

ఏడాది గడుస్తున్నా నెరవేర్చని హామీలు

ములకలచెరువు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెవేర్చలేదని పలువురు మహిళలు ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ తలపెట్టిన ×బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ॰ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం మండలంలోని పెద్దపాళ్యం, వేపూరికోట, పర్తికోట, దేవులచెరువు పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు సర్కార్ ప్రజలకు చేసిన మోసంపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు నమ్మబలికి అధికారంలోకి వచ్చాక పథకాలపై ఊసే లేదని పలువురు మహిళలు చెప్పకొచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఏడాది పంటల సాగు కోసం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పి ఖరీఫ్ సీజన్ వెళ్లిపోతున్నా ఇంతవరకు నగదు జమచేయలేదని వాపోయారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు, కరెంట్ చార్జీలు పెంచడంపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చేవని, ఇప్పుడు రేషన్ షాపుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాధవరెడ్డి, ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచులు వై. విజయమ్మ, సునిత, రాంబాబునాయుడు, మహబూబ్‌బాషా, ఎంపీటీసీలు నరసింహులునాయుడు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌నాయుడు, మల్లికార్జునరెడ్డి, ఉమామహేశ్వర్, డాక్టర్ విశ్వనాథ్, టంగుటూరి శ్రీనివాసులు, బాస్కర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మద్దిరెడ్డి, నజీర్, మస్తాన్, అహ్మద్, చాంద్‌బాషా, అన్సర్‌బాషా తదితరులు ఉన్నారు.

జగన్ పాలనలోనే సంక్షేమ పథకాలు

తంబళ్లపల్లె: జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని రకాలు సంక్షేమ పథకాలు అందాయి. ఈ చంద్రబాబు పాలనలో ఇప్పుడు ఏమి ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు బాబు ఇచ్చిన హామీలతో ఆశపడి ఓట్లు వేశాం. బాబు మాటలు విని మోసపోయామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్‌ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం విశేషం. అబద్ధాలు, మోసపూరిత హామీలతో గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత మోసాలను ఎండగడుతున్నారు. మండలంలోని బాలిరెడ్డిగారిపల్లె, కోసువారిపల్లె, పంచాలమర్రి పంచాయతీల్లోని పలు పల్లెల్లో ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వంలో అమలైన మేలు, పథకాలు, ఇప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిన తీరుపై క్యూర్ కోడ్ కరపత్రాలను పంచుతూ ప్రజలను ప్రశ్నించి వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు బెంగుళూరు మల్లికార్జునరెడ్డి,శివారెడ్డి, కిషోర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, వాసుదేవరెడ్డి, అప్పిరెడ్డి, సురేంద్రనాథ్, కోటిరెడ్డి,నారాయణరెడ్డి, రామమూర్తి, చంద్రశేఖర్, పిజె వెంకటరమణారెడ్డి, పద్మనాభరెడ్డి, శంకరరెడ్డి, మల్లికార్జున, రఘు, బావాజాన్,సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా ప్రజలకు మోసం

పెద్దతిప్పసముద్రం: బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మండలంలోని అంకిరెడ్డిపల్లి పంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. ఎంపీపీ మహమూద్, పార్టీ మండలాధ్యక్షుడు కొట్టి మల్లికార్జున, జెడ్పీటీసీ ఉంగరాల శివన్న, వైస్ ఎంపీపీ పట్టిరిక శోభాశంకర్‌లు మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలు, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. చంద్రబాబు ఓట్లు దండుకుని పథకాలు ఎగ్గొట్టి పేదల జీవితాలకు గ్యారంటీ లేకుండా చేసారని ఎద్దేవా చేసారు. జగనన్న పాలనలో అందిన సంక్షేమ పథకాలు, కూటమి పాలనలో అందుతున్న పథకాలపై ప్రజలే బేరీజు వేసుకోవాలని ఇంటింటికీ వివరించారు. స్థానిక సర్పంచ్ భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిప్రసాద్, గిరీస్వామి, విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్, నారాయణస్వామి, జనార్దన్‌రెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.







బి.కొత్తకోట: బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, తంబళ్లపల్లె : కూటమి ప్రభుత్వం వైఫల్యాలను తెలియజేస్తున్న నాయకులు, పెద్దతిప్పసముద్రం: అంకిరెడ్డిపల్లి పంచాయతీలో..

సోమేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ: శ్రావణమాసం పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పంచామృత రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. లలితాత్రిపురసుందరి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీటీఎంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం చేశారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా టి.ఎల్. వెంకటేష్

పీలేరురూరల్ : సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా టి.ఎల్. వెంకటేష్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సీపీఐ కార్యాలయం జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా నరసింహులు, పి.వి. రమణ, కార్యవర్గ సభ్యులు 11 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టి.ఎల్. వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తానని తెలిపారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

నిమ్మనపల్లె : సైబర్ నేరాల నివారణపై ఎస్‌ఐ తిప్పేస్వామి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం తవళం హైస్కూల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలతో అనుచిత ప్రవర్తన, వేధింపులు తదితర అంశాలపై వివరించారు. రోడ్డుభద్రతా నియమాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు తెలియజేశారు. శక్తి యాప్ ఉపయోగాలు వివరించి సెల్‌ఫోన్ ఉన్న విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీధర్

పెద్దతిప్పసముద్రం: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్ అధికారిక శిక్షణ నిమిత్తం శ్రీకాళహస్తికి వెళ్లారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలోనే ఏఓగా పనిచేసే శ్రీధర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

ఇన్‌చార్జ్ సీఐగా యుగంధర్

కలికిరి: కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐగా పీలేరు సీఐ యుగంధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి గురువారం నుంచి సెలవుపై వెళ్ళారు. కర్నూలు డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని అందిన ఉత్తర్వుల మేరకు సోమవారం రెడ్డిశేఖర్ రెడ్డి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కాగా గత ఏడాది ఆగస్టు 11న ఆయన కలికిరి సీఐగా బదిలీపై వచ్చారు.

నల్లగుట్టను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి

- సబ్ కలెక్టర్‌కు అంకిశెట్టిపల్లె గ్రామస్తుల వినతి
- గ్రామస్తులపై తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ఆవేదన



నల్లగుట్టను పరిరక్షించాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు విన్నవిస్తున్న అంకిశెట్టిపల్లె గ్రామస్తులు

మదనపల్లె రూరల్ : అంకిశెట్టిపల్లె పంచాయతీలోని నల్లగుట్టను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని,సెక్యూరిటీ ఏర్పాటుచేసి హార్సిలీహిల్స్ తరహాలో అభివృద్ధి చేయాలని గ్రామస్తులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అంకిశెట్టిపల్లె సర్పంచ్ శరత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు సబ్ కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అంకిశెట్టిపల్లె పంచాయతీ సర్వేనెం.15లో సుమారు 75 ఎకరాల్లో నల్లగుట్ట ఉందన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు ఆవులు, గొర్రెల మేతకు ఎంతో అనుకూలంగా ఉండేదన్నారు. గుట్టలోని పెటి గంగమ్మదేవతకు ప్రతిఏటా అంకిశెట్టిపల్లె గ్రామప్రజలు జాతర నిర్వహించేవారమన్నారు. శీతాకాలంలో గుట్టపై సీతాఫలం, ఉలింజకాయలు కోసుకుని ఎస్సీ,ఎస్టీలు జీవనాధారంగా బతికేవారన్నారు. నల్లగుట్టలో కొందరు వ్యక్తులు బుద్ధుని విగ్రహం పెట్టేందుకు చొరబడ్డారన్నారు. దీంతో పశువులకు మేత లేకుండా పోతుందని, గతంలోనే పంచాయతీలో గ్రామసభ నిర్వహించి, గ్రామప్రజలంతా కలిసికట్టుగా బుద్ధ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించడం జరిగిందన్నారు. అయితే అక్రమంగా నల్లగుట్టలో బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటుచేయడం, ఆ తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం జరిగిందన్నారు. గతంలో గ్రామస్తులు విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించడాన్ని మనస్సులో పెట్టుకుని, గ్రామస్తులందరిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. పోలీసులు చాకచక్యంగా కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంతో గ్రామస్తులకు సాంత్వన లభించిందన్నారు. ప్రస్తుతం బుద్ధునికొండలో పెద్ద విగ్రహం, అక్కడక్కడా చిన్న చిన్న విగ్రహాలు ఉన్నాయని, వాటికి ఏమైనా జరిగితే మళ్లీ గ్రామస్తులు నిందలు మోయాల్సి వస్తుందని, ప్రభుత్వం వాటి రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిని ప్రక్షాళన చేయండి

మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని నియమించి, ప్రజలను దోపిడీచేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిరసన ప్రదర్శన అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి, ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై వినతిపత్రం అందజేశారు.

రామకృష్ణనగర్ ప్లాట్లకు హద్దులు చూపండి..

తట్టివారిపల్లె పంచాయతీలో శ్రీరామకృష్ణనగర్ ప్లాట్ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్‌కు సర్వేనెం.84లో 1984లో ప్లాట్లు వేసి కేటాయించిన 12.35 ఎకరాల స్థలంకు ప్రస్తుతం సరిహద్దులు తెలియక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించాల్సిందిగా ప్రెసిడెంట్ పి.ఈశ్వరయ్య సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిచేశారు.

రైతులు లేకుండా రీసర్వే చేస్తారా

-మళ్లీ సర్వే చేయాలని రైతుల వినతి



సమస్యలను తహసీల్దార్‌కు వివరిస్తున్న రైతులు

బి.కొత్తకోట: రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న తొందర్లో సర్వే బృందాలు తమ ఇష్టమొచ్చినట్టు సర్వే పూర్తి చేసి తమకు తీరని అన్యాయం చేశారని పేర్కొంటూ సోమవారం స్థానిక తహసీల్దార్ ఎ.బావాజాన్‌కు శీలంవారిపల్లె పంచాయతీ రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆందోళన వ్యక్తం చేసిన రైతులు, ఆగ్రహానికి గురయ్యారు. సర్వే సమయంలో సిబ్బంది నిర్లక్ష్యంపైనా ఫిర్యాదు చేసారు. శీలంవారిపల్లె పంచాయతీలో రైతులు సర్వే సమయంలో టమోట పంటను సాగు చేయడంతో గడువు ఇవ్వకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వడకుండా ఎలా సర్వే చేశారని ప్రశ్నించారు. గ్రామానికి సంబంధించి కనీసం 200 కుటుంబాలు ఉపాధి కోసం బెంగళూరు, తిరుపతి, కడప, హైదరబాద్, మదనపల్లెకి వలసలు వెళ్లారని, వీరికి సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం పరిధిలో కేసులు నడుస్తున్న భూములకు సర్వే చేయమని చెప్పిన వీఆర్‌ఓ ఒకరికి లబ్ధి చేకూరేలా వ్యవహరించారని పేర్కొన్నారు. ఒమ రైతుకు పంచాయతీలోనే రెండు-మూడు చోట్ల భూములు ఉండగా ఆయా రైతులు పంటసాగు, దిగుబడి తరలింపు పనుల్లో బిజీగా ఉండగా వారు ఒకచోట సర్వేకు హాజరుకాగానే మరోచోట సర్వేలో హాజరుకాకపోవడంతో వాటికి సంబంధించిన భూ విస్తీర్ణంలో తేడాలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ బావాజాన్ రైతుల ఇబ్బందులు తొలగించేందుకు గ్రామంలో రీసర్వేను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీఇచ్చారు.

ఆర్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా

మదనపల్లె: గతంలో మాదిరి వాహనాల ఎఫ్‌సీ ధృవీకరణ ప్రక్రియ ప్రభుత్వ రవాణాశాఖ కార్యాలయాల పరిధిలోనే జరగాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ శ్రేణులు స్థానిక రవాణాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కార్పోరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శిస్తూ నినాదాలు చేశారు. తక్షణమే పాత పద్ధతిలో ఎఫ్‌సీ ధృవీకరణ విధానం పురుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుమల, రెడ్డెప్ప, మస్తాన్, గంగులప్ప, కరీముల్లా, మహబూబ్‌బాషా, చందు, బాలు, విగ్రాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

మదనపల్లె సిటీ: తమతో పాటు చదువుకున్న స్నేహితుల కోసం ఎలక్ట్రిక్ బైక్‌లు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. గుర్రంకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో పాటు చదువుకున్న మహబూబ్‌ఖాన్, శ్రీనివాసులు దివ్యాంగులు. వీరు ఎక్కడైనా వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్నేహితుల దృష్టికి రావడంతో అందరూ కలిసి డబ్బులు సమకూర్చుకుని రెండు ఎలక్ట్రికల్ బైక్‌లు రూ.1.40 కొనుగోలు చేశారు. వీటిని సోమవారం మదనపల్లె పట్టణం నిమ్మనపల్లెరోడ్డులోని మోటార్స్ షోరూంలో ఉపాధ్యాయులు యూసుఫ్, శ్రీరాములు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు రెడ్డప్ప, రవి, భూదేవి పాల్గొన్నారు.

వెలుగు సేవా సంస్థకు సేవా ధార్మిక్ అవార్డు

మదనపల్లె సిటీ: సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక పాఠశాల, ఆశ్రమం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్న వెలుగు సేవ సంస్థకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక సేవా ధార్మిక్ అవార్డును వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి అందుకున్నారు. వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో లతా రాజా ఫౌండేషన్ నిర్వాహకులు అవార్డును అందించారు. అవార్డు అందుకున్న వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సేవా ప్రయాణానికి గుర్తింపు లభించిందన్నారు.

అక్రమ అరెస్టులపై ఆందోళన వద్దు

కలకడ : అక్రమ అరెస్టులు చేసినంతమాత్రాన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నట్లు జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి డాక్టర్. సురేష్‌నాయక్ అన్నారు. సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి ఎంపీ మిథున్ రెడ్డి గురించి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు



శివాలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు రూరల్ : అక్రమ లిక్కర్‌లో కేసులో అరెస్ట్ అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి జైలు నుంచి క్షేమంగా విడుదల కోవాలని కోరుతూ సోమవారం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వైఎస్సాసీపీ యువ నాయకులు సునీల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 101 కొబ్బరి కాయలు కొట్టి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ సంబంధం లేని కేసులో పెద్దిరెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం రాజకీయ కుట్రంలో భాగంగానే మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగా ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కేసులో మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ఉదయ్‌కుమార్, ఆనంద్, షాకీర్ కాలనీ చిన్న, సురేంద్రరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, పెద్దోడు, రమణ, పరమేష్, కరీముల్లా, మధు, ఉబేదుల్లా, సాయి, భాను, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, సఫూరా తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన జీవీ శ్రీనాథ్‌రెడ్డి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

పీలేరు : రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పీలేరు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి సోమవారం తిరుపతిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి రాజమండ్రి సబ్ జైల్‌లో ఉన్నందున ఎంపీ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మంచూరి మధుసూదన్‌రెడ్డి, నరసింహులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి(వాల్మీకిపురం): మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై రాజకీయ కక్షతోనే ఎంపీని అరెస్టు చేశారని ఉర్దూ అకాడమి మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీం అన్నారు. తిరుపతిలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వాల్మీకిపురం మైనార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డికి రాజమండ్రి జైలులో అందుతున్న వసతులు, అక్కడి పరిస్థితులను మాజీ మంత్రిని అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ నాయకులు ఆబిద్, అమీన్‌పీర్, షమి, ఇమ్రాన్, జాకీర్ తదితరులు మాజీ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

రామసముద్రం : చెంబకూరు పంచాయతీ కేంద్రంలో చికెన్ సెంటర్లు, తోపుడుబండ్లు, పండ్ల వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను మూటల్లో కట్టి రోడ్లపై పడివేస్తున్నారని, అలాంటివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గఫూర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటిసమస్య ఉన్న గ్రామపంచాయతీల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారికి విన్నవించారు. పంచాయతీలో ప్రతిరోజు డోర్ టు డోర్ తిరిగి పొడి,తడి చెత్త సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలని సూచించారు. ఎక్కడైనా గ్రీన్ అంబాసిడర్లు లేకపోతే కొత్తవారిని నియమించాలన్నారు. అంటురోగాలు ప్రబలకుండా ప్రతి గ్రామంలో పారిశుధ్యం పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. సేకరించిన చెత్తను సక్రమంగా డంపింగ్‌యార్డులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ మాధవి, కార్యదర్శులు పాల్గొన్నారు.